క్లుప్తంగా

వీధి కుక్కలపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న డీసీ మారుతి దివాకర్

ఎల్‌బీనగర్: వీధుల్లో కుక్కల పట్ల విద్యార్థులు తగు అప్రమత్తంగా ఉండాలని.. వీధి కుక్కలు ఎదురైనప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీదివాకర్ సూచించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వీధి కుక్కలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు కుక్కలను కొట్టడం.. వాటిని ఇబ్బంది పెట్టడం లాంటిని చేయకూడదని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ అధికారి యాదగిరి రావు, ప్రాజెక్ట్ అధికారి బలారాం తదితరులు పాల్గొన్నారు.

'కాలనీవాసులపై కేసులను ఉపసంహరించుకుంటా'

లింగోజిగూడ: కామేశ్వర కాలనీవాసులపై తను పెట్టిన కేసులను ఉపసంహరించుకుంటానని అడ్వకేట్ సుభాష్ బుధవారం కాలనీలో జరిగిన సమావేశంలో వెల్లడించారు. మూడేళ్ల క్రితం నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కాలనీవాసులు స్పీకర్ల ద్వారా పాటలతో పాటు బతుకమ్మ ఆటలు ఆడుతున్నారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులకు స్థానికంగా ఉండే అడ్వకేట్ సుభాష్ మధ్య వివాదం మొదలై గొడవకు దారితీసింది. దీంతో సుభాష్ 31 మంది కాలనీవాసులపై అట్రాసిటీతోపాటు మరో మూడు కేసులను కోర్టులో దాఖలు చేశారు. ఈ విషయంలో కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు బోయిని మహేందర్‌యాదవ్‌ల జోక్యంతో ఇరు వర్గాల వారు శాంతించారు. ఈ క్రమంలో అడ్వకేట్ సుభాష్ అందరి సమక్షంలో కాలనీవాసులపై తాను కోర్టులో వేసిన అన్ని కేసులను ఉపసంహరించుకుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా గోస-బీజేపీ భరోసా'కు ప్రజాస్పందన


గడ్డిఅన్నారంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. కార్నర్ మీటింగ్ చివరిరోజు మంగళవారం రాత్రి కేంద్ర పోలింగ్ బూత్ ఇంచార్జి వివేక్ చారి ఆధ్వర్యంలో గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. విశ్వకర్మ సంఘం సభ్యులు వేణుగోపాల్‌చారి, నర్సింహాచారి, వలబోజు శ్రీనివాసాచారి, కీర్తిగారి అనంతాచారి, గోవర్ధన్, లవకుమార్, వెంకటరమణ, వెంకటాచారి, నాయకులు రాంరెడ్డి, జయప్రకాశ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేయండి

సైదాబాద్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి స్థానికులకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. బుధవారం ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి గడ్డిఅన్నారంలోని పిల్లిగుడిసెల వద్ద నిర్మాణంలో ఉన్న వరద నీటి కాలువ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బేడ బుడగ జంగం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

చంచల్‌గూడ: తెలంగాణ రాష్ట్ర బేడ బుడగ జంగం కేంద్ర కమిటీని కుర్మగూడ డివిజన్‌లో కేంద్ర కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడమంచి అనూప్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కడమంచి అజయ్‌కుమార్, కోశాధికారిగా నరేష్‌లను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. సంఘం ప్రధాన సలహాదారు ఎస్.సత్తయ్య వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ... సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. బుడగ జంగాలకు కేంద్ర, రాష్ట్రాలు అందిస్తున్న పథకాలు అందేలా ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు అంజయ్య, బాబురావు, శివరాములు, రాజేష్, శ్రీహరి, శివ, కిరణ్, నరేష్, వెంకటేష్, బాలు, శ్రీనివాస్, సునీల్, లక్ష్మణ్, శ్రీధర్, శ్రవణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట సమగ్రాభివృద్ధే లక్ష్యం

కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్

కొత్తపేట డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించి.. అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ వెల్లడించారు. డివిజన్‌లో ప్రధాన సమస్యలైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, తాగునీటితో పాటు ఇతర మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. రాజకీయాలు, కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. కొత్తపేట కార్పొరేటర్‌గా రెండేళ్ల పదవీకాలన్ని పూర్తి చేసుకున్న పవన్ కుమార్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ. – నాగోలు


కొత్తపేటలో ట్రంక్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్ (ఫైల్)



ప్రశ్న: జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చారా?

జవాబు: శానిటేషన్, డ్రైనేజీ సమస్య, సీసీ రోడ్లు, పార్కుల సుందరీకరణ, కాలనీ సంక్షేమ సంఘం భవనాలు, ప్రభుత్వ స్థలాల సంరక్షణ, ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేశాను. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల్లో ఇప్పటి వరకు 60 శాతం నెరవేర్చా. రెండేళ్లలో దాదాపు రూ. 12 కోట్లు వ్యయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా.

ప్రశ్న: అసంపూర్తిగా ఉన్న సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు: మూడు దశాబ్దాల క్రితం వేసిన డ్రైనేజీ పైప్‌లైన్ ఉంది. అక్కడక్కడా పైప్‌లైన్ దెబ్బతిని వాటి నుంచి మురుగు పొంగి పొర్లుతోంది. గతంలో కురిసిన భారీ వర్షాలకు డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. అధిక నిధులు తీసుకొచ్చి అన్ని కాలనీలలో కొత్త పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి భవిష్యత్‌లో ఎక్కడా డ్రైనేజీ పొంగకుండా శాశ్వత ప్రాతిపదికన సమస్యను పరిష్కరిస్తా. భరత్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం.

ప్రశ్న: ప్రధాన సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: దశాబ్దాల క్రితం నిర్మించిన పైప్‌లైన్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా పైప్‌లైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తాం. కొత్తపేటలో పార్కు స్థలం కబ్జాకు గురైతే కాపాడి ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చాము. కొంత మంది తనపై, ఉప్పల్ తహసీల్దార్‌పై కోర్టులో కేసు వేసినా భయపడకుండా కాలనీవాసులకు అండగా నిలిచి పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చాము. ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలో వరద నీరు సాఫీగా వెళ్లేంగుకు రూ. 4 కోట్లతో ట్రంక్ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అన్ని కాలనీల్లో సీసీ, బీటీ రోడ్లు నిర్మిస్తున్నాం. రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ సహకారంతో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు మిగతా సమయంలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తాం.

ప్రశ్న: రానున్న రోజుల్లో వేటికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు?

జవాబు: కాలనీలు, బస్తీలోని పలు కమ్యూనిటీ హాళ్లను ఇప్పటికే ఆధునికీకరించాము. అన్ని కాలనీల్లో అన్ని మౌలిక సదుపాలయులు కల్పిస్తాం. అన్ని శాఖల అధికారులు, ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి కొత్తపేట డివిజన్‌కు అధిక నిధులు తీసుకొచ్చి డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాను.

సైదాబాద్‌లో కుక్కల బెడద నివారించండి

మేయర్‌కు మాజీ కార్పొరేటర్ స్వర్ణలతారెడ్డి వినతి


మేయర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న స్వర్ణలతారెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలో ఆందోళన కలిగిస్తున్న కుక్కల బెడద నివారణకు జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సైదాబాద్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆమె జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... సైదాబాద్‌లోని పలు మురికివాడలు, బస్తీలవాసులు నిత్యం పనికి వెళితే వారి పిల్లలు ఇళ్ల వద్ద ఆడుకుంటూ ఉంటారన్నారు. ఆయా ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా తరుగుతుండటంతో వారు భయభ్రాంతులకు లోనవుతున్నారని తెలిపారు. శంకేశ్వరబజార్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో, బస్తీ దవాఖానా వద్ద సైతం కుక్కల బెడద తీవ్రంగా ఉందన్నారు. తన వినతికి మేయర్ సానుకూలంగా స్పందించారని వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు.

సమస్యల సత్వర పరిష్కారానికే 'భరోసా'


మాట్లాడుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించి అభివృద్ధి చేసేందుకు ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. చైతన్యనగర్ చౌరస్తాలో బీజేపీ ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, కిషోర్‌రెడ్డి, శరత్‌కుమార్, విష్ణువర్ధన్‌రావు, భూపాల్, ప్రశాంత్, రాజ్‌వీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకన్న

చైతన్యపురి: అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా మేకా వెంకన్న నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని ఈహెచ్‌ఆర్‌సీ జాతీయ అధ్యక్షుడు షేక్ గౌస్ ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో మానవ హక్కులకు రక్షణ లేకుండా పోయిందని, హక్కుల కోసం పోరాడే వారిని ప్రభుత్వం అణచివేయాలని ప్రయత్నిస్తోందన్నారు. మానవ హక్కుల పరిరక్షణకు తాను కృషి చేస్తామన్నారు.



వెంకన్నకు నియామకపత్రం అందజేస్తున్న షేక్‌గౌస్

అభివృద్ధిని విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం: బీజేపీ


అభివాదం చేస్తున్న బీజేపీ నాయకులు

లింగోజిగూడ: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి అవినీతి, అక్రమాలకే అధిక ప్రాధాన్యం ఇస్తోందని, స్కాములు తప్ప స్కీముల ఊసే ఎత్తడం లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సి.హెచ్.విఠల్ అన్నారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి శక్తి కేంద్ర కార్నర్ సమావేశాల ముగింపు సభ ఎల్‌బీనగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా విఠల్, సామ రంగారెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం మింగేస్తోందని ఆరోపించారు. నియోజకవర్గంలోని ఎన్నో కాలనీల్లో ప్రజలు కనీస వసతులు లేకుండా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఎల్‌బీనగర్‌లో 106 కార్నర్ సమావేశాలు నిర్వహించామని వివరించారు. నాయకులు వీరేశం గుప్తా, మల్కాజిగిరి కుమార్, గంగాధర్‌గౌడ్, కృష్ణంరాజు, శ్రీనివాస్, హరిప్రసాద్, కిరణ్‌కుమార్, జగదీష్, రాహుల్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

'కంటివెలుగు'తో దృష్టి లోపాల నివారణ

సైదాబాద్: దృష్టి లోపాలను నివారించేందుకే ప్రభుత్వం కంటివెలుగు కేంద్రాలను ఏర్పాటు చేసిందని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రెవిన్యూబోర్డ్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డివిజన్ పరిధిలో కంటివెలుగు కేంద్రాన్ని మొదట మహిళా భవన్‌లో, తరువాత పద్మావతీ కల్యాణ మండపం కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేశామన్నారు. రెవిన్యూ బోర్డ్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఇక్కడ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలవాసులు అందరికీ కంటివెలుగు కేంద్రం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, జ్యోతి, రమ్య, ప్రియ, వరప్రసాద్ పాల్గొన్నారు.


కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమోట కిలో రూ. 23, వంకాయ 18, బెండ 55, పచ్చిమిర్చి 40, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 10, క్యారెట్ 19, దొండ 35, ఆలు 19, ఉల్లి 14, గోకర 45, దోస 35, సొర 13, పొట్ల 18, అరటి 9, చిక్కుడు 35, అర్వి 70, మునగ 45, చిలగడదుంప 40, బీట్‌రూట్ 23, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 55. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఘనంగా దేవతావిగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం


కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న దృశ్యం

లింగోజిగూడ: మణిపురి కాలనీలోని శ్రీ షిరిడీ సాయి, దత్తాత్రేయ, గణపతి విగ్రహాల పునఃప్రతిష్ఠాపనోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ నేతలు ప్రవీణ్‌రెడ్డి, మల్లికార్జున్, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్, కృష్ణప్రసాద్, శేఖర్‌బాబు, రాజు, లక్ష్మీకాంత్, సర్వేశ్వర్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

రజకులకు రాజకీయంగా ప్రాధాన్యమివ్వాలి

నాగోలు: రజకులకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని రజక సంఘం నాయకులు పెద్దవూర బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. బుధవారం నాగోలు డివిజన్ సాయినగర్ కాలనీలో రజక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ... అన్ని రాజకీయ పార్టీలు రజకులను ఓటుబ్యాంకుగా చూస్తున్నారన్నారు. తెలంగాణ ఏర్పడితే మా జీవితాలు మారుతాయని ఎంతోమంది ఉద్యమ సమయంలో ప్రాణ త్యాగాలు చేసినా రజకులకు పూర్తి న్యాయం జరగలేదని విచారం వ్యక్తం చేశారు. సంఘం నాయకులు పగడాల లక్ష్మణ్, వడ్లాల మడివేలు, నాంపల్లి శంకర్, పగిళ్ల వెంకట్, మద్దూరి యాదయ్య, పగిళ్ల వెంకటేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో బీజేపీకి పూర్వవైభవం తథ్యం

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గంలో బీజేపీకి పూర్వ వైభవం తప్పక వస్తుందని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి సండడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గౌర విజయకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల దినేష్, కార్పొరేటర్ డివిజన్ పరిధిలోని శాలివాహననగర్‌లో మంగళవారం రాత్రి జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు హాజరై మాట్లాడుతూ... బీజేపీ పట్ల ప్రజల్లో అపారమైన నమ్మకం పెరుగుతోందన్నారు. కార్నర్ మీటింగ్ ద్వారా బీజేపీ అన్ని వర్గాల ప్రజలకు చేరువైందన్నారు. మజ్లిస్, బీఆర్‌ఎస్ పార్టీల విధానాల పట్ల విసిగిపోయిన ప్రజలు రాబోయే ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టడం ఖాయమన్నారు. లీగల్ సెల్ జిల్లా కన్వీనర్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి ఆవుల ప్రవీణ్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన మీటింగ్‌లో నాయకులు వై.సురేందర్, జక్కా మోహన్‌రెడ్డి, పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, సందీప్, సురేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



మలక్‌పేటలో పీఆర్‌టీయూ నేతల ప్రచారం

మలక్‌పేట: సైదాబాద్ మండల పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు బుధవారం మలక్‌పేటలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ, ప్రభుత్వ జూనియర్ బాలికల కాలేజీ, ప్రభుత్వ పాఠశాలలో కరపత్రాలు పంచిపెట్టి ప్రచారం చేశారు. పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రచారంలో జ్యోతి చెన్నకేశవరెడ్డి, మండల అధ్యక్షుడు మందడి వెంకట్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జయ, ఫిజికల్ డైరెక్టర్లు పర్వత్‌గౌడ్, జక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెత్త కాల్చివేత

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ అధ్వానంగా తయారైంది. పలు కాలనీలలో రోడ్ల వెంబడి చెత్త కుప్పలు పేరుకు పోతున్నాయి. చెత్తను సకాలంలో డంపింగ్ యార్డుకు తరలించాల్సిన సిబ్బంది పేరుకుపోయిన చెత్తకుప్పలకు నిప్పు పెడుతు కాలనీలలో పొగబెడుతున్నారు. చెత్తను యథేచ్ఛగా కాలుస్తుండటంతో కాలనీలలో కాలుష్యం పెరిగిపోతోంది. చెత్తను కాలకుండా చూడాల్సిన శానిటేషన్ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదని, చెత్తను కాల్చడం వల్ల వచ్చే పొగ, కాలుష్యంతో తాము ఇబ్బందులు పడుతున్నామని కాలనీల ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్మికులు చెత్తను కాల్చకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హరిహర సుతుడు.. భక్తవల్లభుడు

- నేటి నుంచి అయ్యప్ప స్వామి ఆలయ పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలు
- ముస్తాబైన అయ్యప్ప ఆలయం


ముస్తాబైన కర్మన్‌ఘాట్ అయ్యప్ప ఆలయం

హస్తినాపురం: కర్మన్‌ఘాట్ బైరామల్‌గూడలోని హరిహర క్షేత్రంలోని అయ్యప్ప స్వామి భక్తుల కోర్కెలు తీరుస్తూ భక్తవల్లభుడిగా విరాజిల్లుతున్నాడు. పురాతన అక్కన్న, మాదన్న దేవాలయాల ప్రాంగణంలో సుమారు రూ. 14 కోట్ల వ్యయంతో నాలుగు వేల చదరపు గజాల విస్తీర్ణంలో శబరిమలలోని అయ్యప్ప స్వామి ఆలయాన్ని తలపించేలా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ వంగా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో 12 ఏళ్ల క్రితం నిర్మాణానికి శ్రీకారం చుట్టి రెండు సంవత్సరాలలో పూర్తిచేశారు. ఈ హరిహర క్షేత్రంలో 140 టన్నుల బరువున్న ఏకశిలతో నిర్మించిన పదునెట్టాంబడి ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. అయ్యప్ప మాలధారులు, మహిళా భక్తులు శబరికి వెళ్లలేని వారు హరిహర క్షేత్రంలో అయ్యప్ప స్వామిని దర్శించుకుని ముడుపులు, ఇరుముడులను సమర్పిస్తారు. హస్తినాపురం డివిజన్ సాగర్‌రింగ్‌రోడ్డు బైరామల్‌గూడ డిఫెన్స్ కాలనీలోని ఈ ఆలయంలో ఈ నెల 2 నుంచి 6 వరకు పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు.

5న చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం...

పుష్కర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి వజ్ర వైఢూర్యాలు పొదిగిన 40 నుంచి 50 తులాల బరువున్న స్వర్ణ కిరీటాన్ని చేయించారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఈ కిరీటానికి మార్చి 5న ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరిస్తారు. అదేరోజు సరస్వతి జ్ఞానపుత్ర చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

పటిష్ట ఏర్పాట్లు



ఒకవైపు ధ్యానాంజనేయ స్వామి ఆలయం, మరోవైపు హరిహర సుతుడు అయ్యప్ప ఆలయంతో కర్మన్‌ఘాట్ ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది. ధర్మకర్తలు, భక్తుల ఆధ్వర్యంలో దేవాలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నాం. హరిహరక్షేత్ర అయ్యప్ప ఆలయంలో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశాము. పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 2 నుంచి 6 వరకు నిర్వహించనున్నాం. ఐదు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాము. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశాము. భక్తులు పెద్దఎత్తున పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతున్నా.

– వంగా మధుసూదన్‌రెడ్డి, ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్

గొలుసు దొంగల అరెస్టు

- కత్తులతో మహిళలను బెదిరించి స్నాచింగ్‌లు
- ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

నాగోలు: సులువుగా డబ్బు సంపాదించాలని మహిళలను బెదిరించి వారి మెడలోని బంగారు గొలుసులను లాక్కెళ్తున్న ఇద్దరిని హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 7 గ్రాములు బంగారం, 3 చిన్న కత్తులు, రెండు ద్విచక్ర వాహనాలు, 3 సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఏపీలోని గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్లకు చెందిన బనావత్ బాలాజీ నాయక్(25) నగరానికి వచ్చి ఎల్లారెడ్డి కాలనీ ఆపిల్ భవనం సమీపంలో నివాసం ఉంటున్నాడు. కంటోన్మెంట్ ఆర్టీసీ డిపోలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఏపీలో తూర్పుగోదావరి జిల్లా పేరూరు అమలాపురానికి చెందిన చిట్టూరి రాజకిరణ్ (32) నగరానికి వచ్చి ఫిరోజ్‌గూడ భగ్ కాలనీలో ఉంటూ కార్తీక్ రోషన్ పంప్స్, కంట్రోలర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో చీఫ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. గతంలో క్యాబ్ డ్రైవర్లుగా ఉన్న సమయంలో ఇద్దరికి పరిచయం. దీంతో వచ్చే డబ్బులు సరిపోక సులువుగా డబ్బులు సంపాదించాలని పథకం చేశారు. ద్విచక్ర వాహనాలను కిరాయికి తీసుకుని నగరంలో తిరుగుతూ ఒంటరిగా ఉన్న మహిళలను కత్తులతో బెదిరించి వారి మెడలోని బంగారు గోలుసులను లాక్కెళ్లేవారు. ఈ క్రమంలో పంజగుట్ట, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్నాచింగ్‌లు చేశారు. రెండు రోజుల క్రితం హయత్‌నగర్, ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లలో పరిధిలో వరుస స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. మంగళవారం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బండ్లగూడలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో శ్వేత సమీపంలో డీమార్టుకు వెళ్లి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు కత్తితో బెదిరించి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు తెంచుకొని పారిపోయేందుకు ప్రయత్నించారు. శ్వేత ప్రతిఘటించడంతో అమె చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని కాలనీలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. ఈ క్రమంలో హయత్‌నగర్ పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. వారి నుంచి 7 గ్రాములు బంగారం, 3 కత్తులు, రెండు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో వనస్థలిపురం, ఎల్‌బీనగర్ ఏసీపీలు పురుషోత్తంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.